మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

సింగరేణి అంతానికి కాంగ్రెస్ కుట్ర

- కొడంగల్, మధిరకు డీఎంఎఫ్‌టీ నిధులు మళ్లింపు
- ఎక్స్‌ప్లోజివ్ టెండర్లు, జైపూర్ ప్లాంట్ పనుల్లో అక్రమాలు
- సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ మే 27 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని కాపాడుకోగా, కాంగ్రెస్ సర్కారు మాత్రం అవినీతి, అక్రమాలతో సంస్థను అంతం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5 వేల కోట్లతో జైపూర్ పవర్ ప్లాంట్ ఫేజ్-2 పనులను ప్రతిపాదించగా, కాంగ్రెస్ సర్కారు దానిని రూ.9 వేల కోట్లకు పెంచి కమీషన్లు దండుకునేందుకు యత్నిస్తున్నదని మండిపడ్డారు. ఎక్స్‌ప్లోజివ్స్ టెండర్లలోనూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, టెండర్లను ఏకంగా మూడు రెట్లకు పెంచారని ఆరోపించారు. సంస్థ డీఎంఎఫ్‌టీ నిధులను సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి నియోజకవర్గాలైన కొడంగల్, మధిరకు తరలించుకుపోయారని విమర్శించారు. 130 ఏండ్ల సంస్థ చరిత్రలో ఇంతటి దుర్మార్గాలను ఏనాడూ చూడలేదని దుయ్యబట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో 11 ఏరియాల గని కార్మికులతో సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశం నిర్వహించారు.

మోదీ కోసమే రేవంత్ మౌనం

ప్రధాని మోదీ ప్రాపకం కోసం సీఎం రేవంత్ పనిచేస్తున్నారని కవిత ఆరోపించారు. అందుకే లేబర్‌కోడ్‌ల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే తానే స్వయంగా గనులు, ఓపెన్‌కాస్ట్‌ల వద్ద ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు.

కో-ఆర్డినేటర్ల నియామకం

సింగరేణి జాగృతి కో-ఆర్డినేటర్లుగా బెల్లంపల్లి-కిరణ్ ఓరం, శ్రీరాంపూర్-కుర్మ వికాస్, మందమర్రి-ఎస్ భువన్, రామగుండం-1-బొగ్గుల సాయికృష్ణ, రామగుండం-2-కే రత్నాకర్‌రెడ్డి, రామగుండం-3-దాసరి మల్లేశ్, భూపాలపల్లి-నరేశ్ నేత, మణుగూరు-అజ్మీరా అశోక్‌కుమార్, కొత్తగూడెం-వన్నంరెడ్డి వీరనాగేంద్రసాగర్, కార్పొరేట్-వసికర్ల కిరణ్‌కుమార్, ఎస్‌టీపీపీ పవర్ ప్లాంట్-కే రామ్మోహన్‌చారి నియమితులయ్యారు.

18 మంది మావోయిస్టుల లొంగుబాటు

వారిపై రూ.38 లక్షల రివార్డు • ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 27 : మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులు సహా 18 మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 1వ బెటాలియన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నలుగురు మావోయిస్టులు సహా 18 మంది లొంగిపోయారని తెలిపారు. వారిపై రూ.39 లక్షల రివార్డు ఉన్నట్టు పేర్కొన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న 'నియద్ నెల్లనార్' కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయినట్టు వివరించారు. వీరిలో 1వ బెటాలియన్‌కు చెందిన నలుగురు మావోయిస్టులు అనేక విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్టు తెలిపారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- కార్పొరేట్లకు మోదీ సర్కారు దాసోహం
- మన పౌరులను కాల్చిచంపడం దారుణం
- అభివృద్ధి, సంక్షేమంతోనే మార్పు సాధ్యం
- ఇందుకు తెలంగాణ రాష్ట్రమే సజీవ సాక్ష్యం
- కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్‌కౌంటర్లే లేవు
- బీఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్ మే 27 (నమస్తేతెలంగాణ): మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టుల కోరిక మేరకు వారితో శాంతి చర్చలు జరపాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మధ్యవర్తిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచన మేరకు పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు అంగీకరించిన మోదీ ప్రభుత్వం, మావోయిస్టులను మాత్రం నిర్మూలిస్తామని ప్రకటించడం దారుణమని మండిపడ్డారు. అధికారం చేతిలో ఉన్నదని ఇష్టారాజ్యంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. ఇటీవల నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఉస్మానియా యూనివర్సిటీలో 22 విద్యార్థి సంఘాలు ఏకతాటిపైకి వచ్చి మావోయిస్టులతో చర్చలు జరపాలని తీర్మానం చేశాయని, అనేక ప్రజాసంఘాలు సైతం శాంతిస్థాపనకు కృషి చేయాలని విన్నవించినా పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోనే నక్సల్స్ నిర్మూలన సాధ్యమని, ఇందుకు కేసీఆర్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న తెలంగాణే సజీవ సాక్ష్యమని ఉద్ఘాటించారు. కేంద్రంలోనీ బీజేపీ అధికారం చేతిలో ఉన్నదనే కారణంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. హోంమంత్రి అమిత్‌షా 2026లోగా మావోయిస్టులను నిర్మూలిస్తామని ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. వ్యక్తులను అంతమొందించడం ద్వారా వారి ఆలోచనలను నిర్మూలించలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. మూల కారణాలను గుర్తించకుండా కాల్చి చంపడమే విధానంగా మార్చుకోవడం దారుణమని మండిపడ్డారు.

కార్పొరేట్ల కోసమే 'ఆపరేషన్ కగార్'

మధ్య భారత్‌లోని ఖనిజ సంపదను అదానీ లాంటి కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్‌ను కేంద్రం చేపట్టిందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. అందుకే మావోయిస్టుల హింసతోనే అభివృద్ధి ఆగిపోయిందని అసంబద్ధమైన వాదనను కేంద్రం తెరపైకి తెస్తున్నదని ధ్వజమెత్తారు. అదే నిజమైతే నక్సల్స్ లేని రాష్ట్రాల్లో అభివృద్ధిని అడ్డుకున్నదెవరు? అని ప్రశ్నించారు. ఫాసిస్టు విధానాలతో నక్సల్స్‌ను అంతమొందించాలని చూడటం సరికాదని సూచించారు.

తొలి పదేండ్లలో ఒక్క ఎన్‌కౌంటర్ లేదు

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క ఎన్‌కౌంటర్ కూడా జరగలేదని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. కేసీఆర్ దృఢ సంకల్పంతో ప్రాజెక్టులు నిర్మించి గోదావరి, కృష్ణా నదుల్లో నీళ్లు పారించడంతో రక్తపుటేరులు ఆగిపోయాయని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజలకు చేతినిండా పని కల్పించడంతో మావోయిస్టులకు పనిలేకుండా పోయిందని ఉద్ఘాటించారు. 'తుపాకీకి తుపాకీ, రక్తానికి రక్తం' జవాబు కాదని తెలంగాణ రాష్ట్రమే గొప్ప ఉదాహరణ అని చెప్పారు. ఒకనాడు నక్సల్స్‌కు కేంద్ర బిందువుగా ఉన్న తెలంగాణ ఈ రోజు ప్రశాంతంగా ఉందంటే కేసీఆర్ అనుసరించిన విధానాలే కారణమని విశ్లేషించారు.

జాతీయ పార్టీలది హింసాత్మక ధోరణి

నక్సల్స్ సమస్యను దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ సామాజిక కోణంలో చూడలేదని నిరంజన్‌రెడ్డి ఆక్షేపించారు. హింసాత్మక విధానంతో అణచివేయాలని చూశారని మండిపడ్డారు. దేశంలో ఎన్‌కౌంటర్లను సృష్టించిందే కాంగ్రెస్ అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనకు తప్పుడు మార్గంలో వెళ్తున్నదని చెప్పారు. ఇప్పటికైనా నక్సల్స్ సమస్యను సామాజిక, ఆర్థిక సమస్యగా పరిగణించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ దుర్మార్గంగా వ్యవహరిస్తే తిరబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. సర్కారు తప్పిదాలను దేశం హర్షించదని, చరిత్ర క్షమించదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

సామూహిక దహనం అప్రజాస్వామికం

ప్రజాసంఘాల నేతలు డిమాండ్

చిక్కడపల్లి, మే 27: ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాల సామూహిక దహనం అప్రజాస్వామికం అని, బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించాలని మానవహక్కులు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో శాంతి చర్చల సమన్వయ కమిటీ ప్రతినిధి ప్రొఫెసర్ హరగోపాల్, వేదిక కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల తల్లిదండ్రులు, వామపక్ష పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కడసారి ముఖం చూడకుండా చేశారు

ఈ ప్రభుత్వాలు నా కుమారుడి మొఖం కడసారి చూడకుండా చేశాయి. ఎన్‌కౌంటర్ తర్వాత నా కుమారుడి అంత్యక్రియలను చేసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.

-స్వరూప, ఎన్‌కౌంటర్‌లో మరణించిన రాకేశ్ తల్లి

మావోయిస్టుల శవాలంటే భయమెందుకో!

- మృతదేహాలను చూసి... మోదీ, అమిత్‌షా వణికిపోతున్నారు?
- మావోయిస్టులను చంపేసి విజయంగా భావించడం సిగ్గుచేటు
- మృతదేహాలను కుటుంబసభ్యులకు ఇవ్వకపోవడం అమానుషం
- వామపక్షాల పార్టీలు, శాంతి చర్చల సంఘం నేతలు ఆగ్రహం

సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): మావోయిస్టుల ఉద్యమానికి భయపడ్డ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. చివరికి మావోయిస్టుల శవాలను చూసి కూడా వణికిపోతున్నారని వామపక్ష పార్టీలు, శాంతి చర్చల కమిటీ నేతలు విమర్శించారు. అలాంటి వారికి ఈ దేశాన్ని పాలించే నైతికహక్కులేదని మండిపడ్డారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులే దహనం చేయడాన్ని ఖండించారు. మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, శాంతి చర్చల సమన్వయ కమిటీ నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు చలపతి, ఎంసీపీఐ(యూ) మురహరి, వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

చంపి సంబురాలు చేసుకోవడం ఏం పాలన?

ఆదివాసీలను, మహిళలను, మావోయిస్టులను అక్రమంగా చంపివేసి, కేంద్ర బలగాలు నృత్యాలు చేస్తుంటే ప్రధాని, హోంమంత్రి హర్షం వ్యక్తంచేస్తూ సంబురాలు చేసుకోవడం ఏ రకమైన పాలనకు నిదర్శనం? అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి కేంద్రం కుట్రలు చేస్తున్నది.

-జాన్‌వెస్లీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

ఏ ప్రమాణాలతో దహనం చేశారు?

మావోయిస్టుల మృతదేహాలను ఏ ప్రమాణాలు పాటిస్తూ పోలీసులే దహనం చేశారో చెప్పాలి. మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందని కేంద్రం ప్రకటించడమంటే.. మావోయిస్టుల ఉద్యమానికి ప్రజలు మద్దతు పలుకుతున్నట్టే కదా! కేంద్రం ఆరాటమంతా కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం కోసమే.. అందుకే చర్చలు జరపడం లేదు.

-ప్రొఫెసర్ హరగోపాల్, శాంతి చర్చల సమన్వయ కమిటీ ప్రతినిధి

ఇది.. అమానవీయం

మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం అమానవీయం. ఈ ఘటనను సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి, న్యాయవిచారణ జరిపించాలి. చివరికి మావోయిస్టుల మృతదేహాలను కూడా వారి కుటుంబాలకు అప్పగించకుండా అత్యంత క్రూరంగా వ్యవహరించింది.

- కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

చనిపోతే సంబురాలా..

దేశంలో శవాలను అడ్డం పెట్టుకుని రాజకీయాలకు పాల్పడిన చరిత్ర ఎక్కడా లేదు. ఒకరు చనిపోతే సంబురాలు చేసుకోవడం, ఇది గర్వకారణమని చెప్పడం బీజేపీ పాలకులకు మాత్రమే చెల్లింది. మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించకపోవడం అత్యంత దుర్మార్గం. హిందుత్వ వారసులమని చెప్పుకునే బీజేపీ నేతలకు ఇది కూడా తెలియకపోవడం సిగ్గుచేటు.

-జస్టిస్ చంద్రకుమార్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి

అంతర్జాతీయ మీడియా కవరేజీ ఏది?

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్వహిస్తున్న ప్రపంచ అందాల పోటీలకు అంతర్జాతీయ మీడియా కవరేజీ లేనేలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన ఓ మీడియాతో మాట్లాడారు. ఈ పోటీలను రియల్ ఎస్టేట్ ఎక్స్‌పోగా సీఎం రేవంత్‌రెడ్డి మార్చారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ నైపుణ్యాలు ఆశించినప్పటికీ.. చివరకు వారికి మిగిలింది మల్టి ఫ్లెక్స్‌లు, హానర్స్ హోమ్స్, హైదరాబాద్ ప్లాట్లు అని ఆరోపించారు. ఇది నిజంగా అద్భుతమే అని ఆయన ఎద్దేవా చేశారు.

జగిత్యాలలో రిమాండ్ ఖైదీ పరార్

జగిత్యాల కలెక్టరేట్, మే 27 : పోలీసుల కండ్లుగప్పి కోర్టు ఆవరణ నుంచి ఓ రిమాండ్ ఖైదీ పారిపోయాడు. తెలిసిన సమాచారం మేరకు.. జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండలం లింగాపూర్‌కు చెందిన జున్ను ప్రసాద్.. గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన కేసుల్లో అరెస్ట్ అయ్యాడు. జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇటీవల కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లోనూ కేసు నమోదైంది. అప్పటికే జగిత్యాల సబ్ జైలులో ఉన్న ప్రసాద్‌ను విచారణలో భాగంగా మంగళవారం కొడిమ్యాల పోలీసులు తీసుకెళ్లి కోర్టులో హాజరుపర్చారు. కేసును పరిశీలించిన జడ్జి ప్రసాద్‌ను తిరిగి రిమాండ్‌కు పంపాలని ఆదేశించారు. కోర్టు నుంచి బయటకు వచ్చిన రిమాండ్ ఖైదీ తన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్టు నటించి, పోలీసుల కండ్లుగప్పి పారిపోయాడు. రంగంలోకి దిగిన పోలీసులు.. ప్రసాద్ కోసం గాలిస్తున్నారు.

కరోనా వైరస్‌పై భయం వద్దు

- ప్రస్తుత వేరియంట్ వ్యాప్తి రేటు ఎక్కువ.. తీవ్రత తక్కువ
- వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలి
- ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ): కరోనా మళ్లీ కలవరపెడుతున్నది. దేశంలో రోజురోజుకు కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు కొంత భయాందోళనకు గురవుతున్నారు. అయిపోయిందనుకున్న కరోనా మళ్లీ వ్యాపిస్తుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు వివరించారు. ప్రస్తుతం ఒమిక్రాన్ వేరియంట్ పూర్తిగా కనుమరుగైందని చెప్పారు. దాని ఉప వేరియంట్‌లు ఎంసీ1.10.1, ఎల్‌బీ1.3.1, ఎల్‌ఎఫ్7 మాత్రమే ఉనికిలో ఉన్నాయని తెలిపారు. ఈ ఉప వేరియంట్ల నుంచి వచ్చిన జేఎన్.1, ఎల్‌పీ 8.1, ఎక్స్‌ఎఫ్‌పీ, ఎక్స్‌ఈసీ వేరియంట్లే ప్రస్తుతం వ్యాపిస్తున్నట్టు వెల్లడించారు. ఇందులోనూ ఎల్‌పీ 8.1 వేరియంటే 70 శాతం వ్యాపిస్తున్నదని పేర్కొన్నారు. ఈ వేరియంట్ల వల్ల పెద్దగా ప్రమాదమేమీ ఉండదని చెప్పారు. 'గతంలో కరోనా వేరియంట్లు చాలా వచ్చాయి. వాటిలో ఒమిక్రాన్ వేరియంట్ వేగంగా వ్యాప్తిచెందింది. కానీ దాని తీవ్రత చాలా తక్కువ. ఇప్పుడు వ్యాప్తి చెందుతున్న వేరియంట్లు కూడా ఒమిక్రాన్ నుంచి పుట్టుకొచ్చినవే. కాబట్టి వీటి తీవ్రత కూడా చాలా తక్కువగా ఉంటుంది. భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ఒకవేళ కరోనా సోకినా దవాఖానల్లో చేరే అంత తీవ్రత ఉండదు. ఆ పరిస్థితే రాదు' అని డాక్టర్ రాజారావు తెలిపారు. ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని సూచించారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ఇలాంటి సమయంలో జలుబు, దగ్గు సహజమేనని తెలిపారు. ఇవి కాకుండా ఒళ్లునొప్పులు, నీరసం వంటి లక్షణాలు ఉంటే కరోనా టెస్ట్ చేయించుకోవడం ఉత్తమమని రాజారావు సూచించారు. ఒకవేళ కరోనా అని తేలితే ఐసోలేషన్ పాటించాలని, డాక్టర్ సలహా మేరకు ఔషధాలు వాడాలని కోరారు.

ప్రస్తుత వేరియంట్లలో కనిపిస్తున్న లక్షణాలు

- జలుబు, జ్వరం, దుగ్గు, ఒళ్లు నొప్పులు, నీరసం

తీసుకోవాల్సిన జాగ్రతలు

- సాధ్యమైనంత వరకు జనావాసాల మధ్యకు వెళ్లకూడదు.
- ఒకవేళ వెళ్లాల్సి వస్తే ముఖానికి మాస్క్ ధరించాలి.
- బయటికి వెళ్లినప్పుడు తరచుగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- సోకినవాళ్లు బయట తిరగకూడదు. ఒకవేళ తిరిగితే వైరస్ వ్యాప్తి చెందుతుంది.

పహాణీలు భూమి హక్కులను నిర్ధారించవు

ఆలయాల భూవివాదాన్ని ట్రిబ్యునల్ తేల్చాలి: హైకోర్టు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): పహాణీలోని పద్దుల ఆధారంగా భూయాజమాన్య హక్కులు నిర్ధారణ చేయడానికి వీల్లేదని హైకోర్టు తీర్పుచెప్పింది. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లను తొలగిస్తూ కలెక్టర్ గత ఏడాది ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన పూజారులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్య హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల పైవిధంగా తీర్పు వెలువరించారు. రెవెన్యూ రికార్డుల్లో పిటిషనర్లతోపాటు శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలను పట్టాదారులుగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఈ వివాదాన్ని ఎండోమెంట్స్ ట్రిబ్యునల్‌లో తేల్చువాలని చెప్పి పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించారు.

● ఇందిరమ్మా.. మేమేం పాపం చేసినం?

'భూములున్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తరా..? ఏమీ లేనోళ్ల పరిస్థితి అంతేనా..?, కాంగ్రెస్ నాయకులు వారికి నచ్చినోళ్లనే ఎంపిక చేసి, మాకు అన్యాయం చేసిన్రు.. మేమేం పాపం చేసినం..?' అంటూ పెద్దపల్లి జిల్లా పాలకుర్తికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఇండ్లులేని తమకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గంటసేపు ప్లకార్డులతో నిరసన తెలిపారు. తాము అర్హులమైనా ఇండ్లు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కలెక్టర్ సమగ్రవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బసంత్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని, దరఖాస్తుదారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. - పాలకుర్తి

● ప్రభుత్వ పథకాలు అందించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని కోరుతూ నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం హన్మన్‌పల్లికి చెందిన చెంచు మహిళలు మంగళవారం హన్మన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎందరికో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూములు అందజేసిన ప్రభుత్వం తమకు సెంటు భూమికూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అందరిలాగే తమకూ ప్రభుత్వ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. - ధన్వాడ

● పరిహారం ఎప్పుడిస్తారు..?

భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు రెండో విడత పరిహారం ఎప్పుడిస్తారని బాధిత రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు, గంగిమాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన రైతులు మండలకేంద్రానికి సమీపంలో భారత్‌మాల రోడ్డుపై ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత నాగర్‌దొడ్డి వెంకట్రాములు సంఘీభావం తెలిపారు. సైట్ ఇన్‌చార్జి అష్టల్ చేరుకొని పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.- గట్టు

హనుమకొండ చౌరస్తాలో డబ్బాలను తొలగించిన కార్పొరేషన్ అధికారులు

చిరు వ్యాపారులపై ప్రతాపం

హనుమకొండ, మే 27: హనుమకొండ చౌరస్తా కేంద్రంగా చిరు వ్యాపారం చేసుకుంటున్న వారి దుకాణాలను ముందస్తు సమాచారం లేకుండా మంగళవారం బల్దియా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కూల్చివేశారు. 40కి పైగా షాపులను కూల్చివేయగా రూ. 50వేల నుంచి రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని దుకాణాదారులు కన్నీటి పర్యంతమయ్యారు. 'ఏండ్లుగా ఇక్కడ దుకాణాలు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం.. మా బతుకులు ఆగం చేయొద్దని వేడుకొన్నప్పటికి కనికరం చూపలేదు' అని విలపించారు. రోజూ కూరగాయలు అమ్ముకుంటేనే కుటుంబ పోషణ జరుగుతుందని, ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కావడం లేదని ఓ మహిళ విలపించారు.

దాడులపై ఖండన

కాంగ్రెస్ ప్రభుత్వం, బల్దియా అధికారులు చిరు వ్యాపారులపై దాడులు చేసి వ్యాపార సముదాయాలను కూల్చివేయడాన్ని బీఆర్ఎస్ చిరు వ్యాపారుల సంఘం నాయకులు నాయిని రవి, ఎండీ ఇస్మాయిల్ ఖండించారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి చిరు వ్యాపారుల సమస్యలు, జీవనోపాధి విషయమై చర్చిస్తున్నప్పటికీ పట్టించుకోకుండా దాడులు చేయడం సరికాదని తెలిపారు. చిరువ్యాపారుల ఉపాధి, భద్రత చట్టం ఉన్నా వారి హక్కులను పాలకులు కాలరాస్తున్నారని మండిపడ్డారు.

కొడంగల్ ప్రభుత్వ దవాఖానలో సెల్‌ఫోన్ లైట్‌లో మందులు అందిస్తున్న సిబ్బంది

సీఎం ఇలాకాలో కరెంటు కష్టాలు

హైదరాబాద్, మే 27 : సీఎం ఇలాకాలో ప్రజలు తీవ్ర కరెంటు కష్టాలను ఎదుర్కొంటున్నారు. చినుకుపడినా, గాలి వీచినా కరెంటు కట్ చేస్తున్నరు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ప్రభుత్వ దవాఖానలో మంగళవారం ఉదయం కరెంటు పోవడంతో వైద్య సిబ్బంది సెల్‌ఫోన్ లైట్‌లో రోగులకు మందులు పంపిణీ చేశారు. ఇది అక్కడి కరెంటు కష్టాలకు నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్తుపై ఆధారపడిన చిరు వ్యాపారులు సైతం తరచూ కరెంట్ పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

● బకాయిలు చెల్లించాలని మదర్ డెయిరీకి తాళం

పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా రాగిబావి గ్రామానికి చెందిన 20 మంది పాడి రైతులు మంగళవారం మోత్కూరులోని మదర్ డెయిరీకి తాళంవేసి నిరసన తెలిపారు. - మోత్కూరు